

కల్తీ నియంత్రణ..కల్ల!
ఆహార పదార్థాల్లో కల్తీ నియంత్రణ గాలిలో దీపంలా మారింది. జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ సమస్యలతో కొట్టుమిట్టాడుతుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. - 10లో



ఆగని టీడీపీ వర్గీయుల ఆగడాలు
చక్రాయపేట మండలం కుప్పం గ్రామం చిన్న మోరయ్యగారిపల్లెకు చెందిన పార్వతమ్మ పొలంలో రస్తా ఏర్పాటు చేసేందుకు టీడీపీ వర్గీయులు ప్రయత్నిస్తున్నారు. - 10లో



వాతావరణం
జిల్లాలో సోమవారం 22.1 - 31.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.29 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

తహసీల్దార్ సస్పెన్షన్

కడప సెవెన్‌రోడ్స్ : విధుల్లో చేరకుండా ఉద్యోగ నిబంధనలను ఉల్లంఘించి, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా తహసీల్దార్ యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలోని కేఆర్ఆర్‌సీ తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి వుండగా నిర్లక్ష్యం చేయడంతో కలెక్టర్ మెమో ఇచ్చారు. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంతో తహసీల్దార్ యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

వర్గీకరణపై వినతులకు అవకాశం

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ అంశానికి సంబంధించి ఏవైనా అభిప్రాయాలు, వినతులు ఉంటే కమిషన్‌కు తెలిపే అవకాశం ఉందని డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యాలయం విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య వీధి, మొఘల్రాజాపురం, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఉందని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి వినతులు ఉంటే రాత పూర్వకంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30లోపు తెలపవచ్చని సూచించారు. ఈ అవకాశం జనవరి 9వ తేదీ వరకు ఉంటుందని వివరించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తాగునీటి సమస్యపై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాశ్వత నీటి వనరులను గుర్తించాలని అన్నారు. వేసవి నాటికి చెరువులు, కుంటలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలని అన్నారు. మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదిన చేయాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పనులు ఉంటే వెంటనే ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఏవైనా చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని అన్నారు. ప్రజలకు నీటి కొరత లేకుండా ప్రాంతాల వారీగా సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాసులు, ఎస్ఈ వెంకటరామయ్య, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఈ చెన్నకేశవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు నరసయ్య. బి.కోడూరు మండలం మేకలవారిపల్లె గ్రామం. వ్యవసాయ కనెక్షన్ కోసం ఆరు నెలల క్రితం రూ.12,500 డీడీ తీసి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్, ట్రాన్స్‌ఫార్మర్ ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. అవకాశం ఉన్నా పంట సాగు చేసుకునేందుకు వీలు లేక.. గొర్రెలను మేపుకొంటున్నాడు. అధికారులు అదిగో, ఇదిగో అంటూ కాలం సాగదీస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారక వచ్చిందని, ఇక ఇప్పట్లో కనెక్షన్ ఇవ్వరనే భావనకు వచ్చానని ఆయన వాపోతున్నారు.



ఇక్కడ కన్పిస్తున్న మహిళా రైతు పేరు గుడే సరస్వతి. చాపాడు మండలం టీఓపల్లె పంచాయతీ రేపల్లే గ్రామానికి చెందిన ఈ మహిళ రైతుకు 4 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో వ్యవసాయ సాగునీటి కోసం గతేడాది బోరు వేసుకుంది. ఫిబ్రవరిలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో స్పందనలో ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్ తమకు మంజూరు అయినట్లు అధికారులు చెప్పారు. మూడు నెలల నుంచి తమ పేరుతో సర్వీసు ఇచ్చినట్లు నెంబరు కూడా వచ్చింది. గత ఐదు నెలల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం కరెంటు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. తనతోపాటు తమ ఊరిలో ఐదుగురికి ట్రాన్స్‌ఫార్మర్లు రావాల్సి ఉందని, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని బాధిత మహిళ వాపోతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతుపేరు పోకల సాంబశివారెడ్డి. బద్వేలు మండలం వనంపుల పంచాయతీ బాలాయపల్లె గ్రామంలో నివసిస్తుంటాడు. గ్రామంలోని తన పొలంలో బోరు ఏర్పాటు చేసుకుని విద్యుత్ కనెక్షన్ కోసం ఏడాది కిందట డిపాజిట్ చెల్లించాడు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు. కార్యాలయం చుట్టూ అనేకసార్లు తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విద్యుత్ సౌకర్యం లేని కారణంగా పొలాన్ని బీడుగా ఉంచాడు.

ఇదీ వీరి ముగ్గురి పరిస్థితే కాదు. జిల్లాలోని ఎంతో మంది రైతులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ కనెక్షల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లభించడం లేదు.

- ఆర్నెళ్లుగా అందని విద్యుత్ కనెక్షన్లు
- డిపాజిట్ చెల్లించి ఎదురుచూస్తున్న రైతన్నలు
- 2083 మంది దరఖాస్తుదారులకు లభించని ఊరట
- కొత్త దరఖాస్తులు తిరస్కరిస్తున్న ట్రాన్స్‌కో యంత్రాంగం
- చిత్తూరు జిల్లాకు తరలివెళ్లిన ఎలక్ట్రికల్ సామగ్రి

నిరీక్షణ



విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటి తడులు అందిస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కడప : ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతోంది. ఆయకట్టుతోపాటు, నాన్‌ఆయకట్టులో వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అప్రమత్తంగా ఉండాల్సిన ఎస్పీడీసీఎల్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అత్యవసరమైనా అంతే..

వర్షా కాలం సీజన్‌లో జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదవడంతో రైతులు బోరు బావుల ఆధారంగా విద్యుత్ మోటార్లతో వ్యవసాయం చేయాలని నూతన కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. అయితే ఆ దరఖాస్తులకు మోక్షం కలగకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గడిచిన ఆర్నెళ్లుగా విద్యుత్ కనెక్షన్లు జారీ చేయడం లేదు. 2083 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కడప డివిజన్‌లో 173 దరఖాస్తులు, ప్రొద్దుటూరు 636, పులివెందుల 490, మైదుకూరు 794, జిల్లా మొత్తం 2,083 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా విద్యుత్ కనెక్షన్ ఎవరికైనా అత్యవసరమైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజక్టు లిస్టులో పడిపోతుండడం గమనార్హం.

జిల్లాలోని సామగ్రి తరలింపుతోనే..

జిల్లాలోని సబ్‌డివిజన్‌లలో ఆపరేషన్ డీఈల పరిధిలో ఉన్న ఎలక్ట్రికల్ సామగ్రి చిత్తూరు జిల్లాకు తరలించడంతోనే ఈ దుర్భర పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జిల్లాలో ఉన్న స్టాకు చిత్తూరు జిల్లాకు తరలించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు తరలించినట్లు సమాచారం. సింగిల్ ఫోల్ కావాలన్నా.. ఇవ్వలేని దుస్థితిలో ఉండిపోయారు. కాసారాలు కావాలన్నా రైతులు ప్రైవేటుగా తెచ్చుకొని బిగించుకోవడం మినహా గత్యంతరం లేదని పలువురు వాపోతున్నారు. ఇదే విషయమై ట్రాన్సుకో విభాగానికి చెందిన ఓ అధికారి సైతం జిల్లాలో ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని వాపోవడం గమనార్హం.

రైతుల కష్టాలు గుర్తించాలి



విద్యుత్ శాఖ అధికారులు రైతుల కష్టాలు గుర్తించాలి. అనేక వ్యయ ప్రయాసాలు ఎదుర్కొంటూ విద్యుత్ కనెక్షన్ కోసం నిర్ణీత ఫీజు చెల్లించడం జరుగుతుంది. ఇటువంటి తరుణంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. విద్యుత్ కనెక్షన్ కోసం నేను కూడా దరఖాస్తు చేసుకుంటున్నాను. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే సకాలంలో పంటలకు నీటి తడులు అందించుకునేందుకు అవకాశం కలుగుతుంది.
- వెన్నపూస కృష్ణారెడ్డి, రైతు, రాజుపాళెం

అధికారుల చుట్టూ తిరుగుతున్నా..



నాకు 3 ఎకరాల సాగు భూమి ఉంది. కేసీ కెనాల్ సాగునీరు అందాలంటే కష్టం. ఈ క్రమంలో బోరు వేసుకుని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఐదారు నెలల నుంచి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇవ్వటం లేదు. రేపు మాపు మంటూ కాలయాపన చేస్తున్నారు. మా గోడును ఆలపించి ఇప్పటికైనా మాకు ఇవ్వాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని కోరుకుంటున్నాను.
- మునీంద్ర, రైతు, రేపల్లె, చాపాడు మండలం

సేద్య పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

వైవీయూ : జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ సూక్ష్మనీటి సాగుపథకం (ఏపీఎంఐపీ) ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో కంపెనీ డీలర్లు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 29,300 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే జిల్లాలో 21,746 మంది రైతులు 27,768 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం చేసేందుకు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో ఇప్పటికే 4072 మంది రైతులు 4780 హెక్టార్లలో సేద్యం చేసేందుకు పరిపాలనా ఉత్తర్వులు పొందారన్నారు. గ్రామాలలో బిందు/తుంపర సేద్యపరికరాలు అవసరమున్న రైతులను గుర్తించి వీఏఏఎస్/వీహెచ్ఏఎస్/వీఎస్ఏఎస్, ఎంఐఏఓల ద్వారా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేలా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు త్వరగా ప్రాథమిక సర్వే పూర్తి చేయాలన్నారు. తమ వాటాను రైతులు నేరుగా పీడీ అకౌంట్‌కి జమ చేయాలని, ఎవరికీ నగదు రూపంలో ఇవ్వకూడదని సూచించారు. రైతువాటా అందిన వెంటనే పరికరాలను అందించాలని పేర్కొన్నారు. కంపెనీ డీలర్లు తమ బాధ్యతగా పరికరాల అమరికను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్.మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజినీర్లు, ఎంఐడీసీ, వివిధ కంపెనీల ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అన్నారు. మంగళవారం కోదండరాముడి బ్రహ్మోత్సవాలపై స్థానిక పీఎస్‌పీలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కోదండరామున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు రామాలయం చుట్టూ గ్రీనరీని పెంచాలని, లైటింగ్ ఏర్పాట్లు, రామాలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. రామాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రామాలయ చరిత్రను జోడించి టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రచారం కల్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో రామాలయ విశిష్టతను విధిగా ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం భక్తులకు అందజేస్తున్న ఉచిత అన్న ప్రసాదాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

బ్రహ్మోత్సవాల నిధులకు ప్రాథమిక నివేదిక తయారు చేయండి

బ్రహ్మోత్సవాలకు అవసరమయ్యే నిధులకు ప్రాథమిక నివేదికను తయారు చేయాలని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల నాటికి చేపట్టాల్సిన పనులు, అలంకార మండపం, పూజకు అవసరమయ్యే వస్తువులు సేకరణ, భక్తులకు అవసరమయ్యే షెల్టర్లను, తాగునీటి సరఫరా, రామాలయంలో పెద్దఎత్తున లైటింగ్, ఇతర పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

కోదండరాముని భూములకు హద్దులను కేటాయించండి

కోదండరామునికి సంబంధించిన భూముల హద్దులను స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానిక సర్వేయర్‌లను వీరబ్రహ్మం ఆదేశించారు. కార్యక్రమంలో టీటీడీ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, గుణ భూషణ్ రెడ్డి, ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, ఏ.అమర్‌నాథ్ టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే కృషితో జయంతి రైలుకు హాల్టింగ్

రాజంపేట : ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కృషితో జయంతి ఎక్స్‌ప్రెస్‌రైలుకు హాల్టింగ్ ఉత్తర్వులు వెలువడ్డాయని గుంతకల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి అన్నారు. రాజంపేటలో ఆయన మంగళవారం మాట్లాడుతూ రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని వినతులు పంపారన్నారు. కరోనా ముందు నుంచి హాల్టింగ్ ఉన్న రైళ్లకు హాల్టింగ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జయంతి ఎక్స్‌ప్రెస్‌కు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న అయ్యప్పస్వాములకు ఉపయోగకరంగా నిలుపుదల ఉత్తర్వులు దోహదపడతాయన్నారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ. 3,31,968 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్సు అధికారి జానకీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

జీ హుజూర్!

- అధికార పార్టీ నేతలు చెప్పినట్లు వింటున్న పోలీస్ అధికారులు
- ప్రతిపక్షపార్టీ నాయకులపై వరుస అక్రమ కేసులు
- హత్యాయత్నంలో బెయిల్‌పై విడుదలైన నేట్లపల్లె బ్రదర్స్
- ఆపై పీటీ వారెంటు కింద మరో కేసులో రిమాండ్



పోలీసుల అదుపులో నేట్లపల్లె బ్రదర్స్

సాక్షి ప్రతినిధి, కడప : అధికార మార్పిడి తర్వాత అక్రమ కేసులు క్రమం తప్పకుండా తెరపైకి వస్తున్నాయి. నిజాయతీ పరులైన అధికారులకు బదిలీ బహుమానంగా ఇవ్వడంతో.. అధికార వర్గాల్లో ఆత్మస్థైర్యం సన్నగిల్లింది. ఆపై ఖాకీపై ఖద్దరు స్వారీ చేయడం ఆరంభించింది. ఈక్రమంలో వరుసగా అక్రమ కేసులు తెరపైకి వస్తున్నాయి. మైదుకూరు, పులివెందుల సబ్ డివిజన్‌లలో ఆ పాళ్లు మరింత ఎక్కువయ్యాయి. మైదుకూరు తహసీల్దార్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారనే అభియోగాలపై బెయిల్ పొందిన నేట్లపల్లె బ్రదర్స్‌ను మరో కేసులో రిమాండ్‌కు ఆదేశించిన వ్యవహారం చోటుచేసుకుంది.

పోలీసు వ్యవస్థకు మచ్చ తెస్తున్న వైనం

విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, చట్టపరిధి మేరకే పని చేసే అధికారులు కరువయ్యారా.. అధికారం, అక్రమార్జనకు బానిసలయ్యే అధికారులే అధికమయ్యారా.. ఖద్దరు నేతలు ఆదేశిస్తే జీ..హుజుర్ అంటూ తలాడిస్తూ చెప్పిందే తడవుగా ఖాకీలు పని చేస్తున్నారా.. అని ప్రశ్నలకు అవుననే విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. చట్టానికి అనుగుణంగా అడుగులు వేసే నాలుగో సింహం బహు అరుదుగా కూడా కన్పించడం లేదని పలువురు వాపోతున్నారు. రాజకీయ నాయకుల ప్రాపకం కోసం, ఆ మాటున అక్రమార్జన కోసం పరితపిస్తూ పోలీసు వ్యవస్థకు మచ్చ తెస్తున్న ట్రిబుల్‌స్టార్ అధికారులు విశృంకళ నాట్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అందుకు మైదుకూరు పరిధిలోని నేట్లపల్లె బ్రదర్స్ వ్యవహారం చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

తహసీల్దార్‌పై హత్యాయత్నం కేసులో రిమాండ్

మైదుకూరు రెవెన్యూ యంత్రాంగం సమక్షంలో తహసీల్దార్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారని నేట్లపల్లె శివరాం, నేట్లపల్లె రామాంజనేయులు అనే అన్నదమ్ముళ్లపై నవంబర్ 2న కేసు నమోదు చేశారు. కేసు నమోదు వ్యవహారం పోలీసులు రహస్యంగా ఉంచారు. కాగా 7వ తేదీ ఆ ఇరువురు అన్నదమ్ముళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తహసీల్దార్ ఇతర రెవెన్యూ సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులు ఇంట్లోనే ఉంటారా? అన్నదే ఇక్కడ డాలర్ల ప్రశ్న. కాగా, పోలీసులు ఇంట్లో ఉన్న నిందితులుగా చెప్పబడిన నేట్లపల్లె బ్రదర్స్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సరిగ్గా 33 రోజుల తర్వాత డిసెంబర్ 10న ఆ కేసులో నిందితులకు బెయిల్ వచ్చింది. వెంటనే మరో కేసులో పీటీ వారెంటుపై అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.


ఈమారు అల్లిన కథ ఏమిటంటే..

నేట్లపల్లె రామాంజనేయులు తన భార్య మస్తానమ్మతో కోర్టు ద్వారా 2001లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆమె చాపాడు మండలం రాజుపాళెం గ్రామంలో తల్లిదండ్రుల గ్రామంలో నివాసం ఉంటోంది. కాగా నవంబర్ 6న సాయంత్రం 4.30 గంటలకు పెద్దశెట్టిపల్లె గ్రామంలో నేట్లపల్లె బ్రదర్స్ దాడి చేసినట్లు 7వ తేదీన కేసు నమోదైంది. అప్పటికే రెవెన్యూ అధికారులపై దాడి చేసినట్లు నమోదైయిన కేసులో నేట్లపల్లె బ్రదర్స్‌ను అరెస్టు చేశారు. అదే రోజు రిమాండ్‌కు ఆదేశించారు. కాగా మస్తానమ్మ ఫిర్యాదుతో నమోదైన కేసు గురించి పోలీసులు బాహాట పర్చలేదు. బెయిల్ వచ్చిందని తెలుసుకొని అప్పటికప్పుడు పీటీ వారెంటు జారీ చేసి మస్తానమ్మ కేసులో రిమాండ్‌కు పంపించారు. నెలరోజుల పైబడి జైల్లో ఉన్న నిందితుల్ని పీటీ వారెంటు ద్వారా ఎప్పుడైనా విచారణ చేసే అవకాశం ఉండగా పోలీసులు అలాంటి చర్యలు చేపట్టలేదు. బెయిల్ వచ్చిన తర్వాతే పీటీ వారెంటు ద్వారా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపడం వెనుక రాజకీయ దురుద్దేశం స్పష్టంగా కన్పిస్తోందని పలువురు వాపోతున్నారు. ఇదే విషయమై ఓ పోలీసు అధికారి సైతం రాజకీయ కక్ష సాధింపు మేరకే అలా కేసులు వచ్చి చేరుతున్నట్లు ఆఫ్‌ది రికార్డుగా వెల్లడించడం గమనార్హం

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బదిలీ తర్వాతే..

ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు పని చేస్తే ఇలాంటి తప్పుడు కేసులు నమోదు కావడం కష్టమనే ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు బదిలీ బహుమానంగా ఇచ్చారు. ఆయన నవంబర్ 6న బదిలీ అయ్యారు. ఆ తర్వాత జిల్లాలో ప్రధానంగా పులివెందుల, మైదుకూరు సబ్ డివిజన్‌లలో అక్రమ కేసులు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. నేట్లపల్లె బ్రదర్స్ యాదవ సామాజికవర్గానికి చెందిన వారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో చేరడమే అక్రమ కేసులకు ప్రధాన కారణంగా పలువురు చెప్పుకొస్తున్నారు. ఖాకీ అధికారులపై ఖద్దరు నేతలు యథేచ్ఛగా స్వారీ చేసేందుకు అధికారులే స్వయంగా ఇలాంటి చర్యలతో అవకాశం ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా పోలీసు అధికారులు 'నాలుగో సింహం'లా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, చట్టాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల సందడి



- నేడు నోటిఫికేషన్ జారీ
- 14న అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నిక

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. అధిక భాగం ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం ప్రాదేశిక నియోజకవర్గాలు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ జారీ చేయనుంది. అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించే వేదికను తెలియజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీసులు అందించడంతోపాటు గ్రామాల్లో దండోరా వేస్తారు. ఈనెల 14న ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికైన వారితో అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల తేదీ, సమయం, వేదిక గురించిన సమాచారాన్ని అదే రోజు మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులకు నోటీసుల ద్వారా అందజేస్తారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలకు సంబంధించిన అసాధారణ సర్వసభ్య సమావేశాలను నిర్వహించి చైర్మన్లను ఎన్నుకుంటారు.

మొత్తం 205 సంఘాలు

జిల్లాలో 205 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా, వాటి పరిధిలో 11 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మూడు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. వీటి కింద 2,74,872 ఎకరాల ఆయకట్టు ఉండగా, 1,59,552 మంది ఓటర్లు ఉన్నారు. చిన్నతరహా నీటి పారుదల కింద 25 మండలాల్లో 112 సాగునీటి వినియోగదారుల సంఘాల పరిధిలో 30076 ఎకరాల ఆయకట్టు ఉంది. మధ్య తరహా నీటిపారుదలలో పోరుమామిళ్ల, కలసపాడు మండలాల్లో అప్పర్ సగిలేరు ప్రాజెక్టు కింద ఐదు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ పరిధిలో 12,869 ఎకరాల ఆయకట్టు ఉంది. బద్వేలు, బి.కోడూరు, బ్రహ్మంగారిమఠం మండలాల్లో లోయర్ సగిలేరు ప్రాజెక్టు కింద ఆరు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉండగా 6034 ఎకరాల ఆయకట్టు ఉంది. చింతకొమ్మదిన్నె మండలంలోని బుగ్గవంక ప్రాజెక్టు కింద 5 నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉండగా 6455 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ నీటి పారుదల కింద కేసీ కెనాల్ పరిధిలోని 9 మండలాల్లో 32 సాగునీటి సంఘాలు, ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 96,137 ఎకరాల ఆయకట్టు ఉంది. మైలవరం రిజర్వాయర్ కెనాల్ కింద ఏడు మండలాల్లో 28 నీటి సంఘాలు, మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 69,772 ఎకరాల ఆయకట్టు ఉంది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆరు మండలాల్లో 16 నీటి సంఘాలు, మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీల కింద 49,839 ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ కింద పెద్దముడియం మండలంలో ఒక నీటి సంఘం ఉండగా, దాని పరిధిలో 3690 ఎకరాల ఆయకట్టు ఉంది.

ఏకగ్రీవం కాని చోట రహస్య ఓటింగ్

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడైనా ఏకగ్రీవ ఎన్నిక జరగని సందర్భాల్లో చేతులెత్తి ఎన్నుకునే విధానాన్ని అనుసరిస్తే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో అభ్యర్థులకు తెలిసిపోతుంది. ఇందువల్ల వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఎన్నికల నిర్వహణ) రూల్స్, 118 ప్రకారం చేతులెత్తే పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. కనుక చేతులెత్తే విధానం కాకుండా రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలంటూ బెల్లన జగన్నాథం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు హైకోర్టులో ఇటీవల రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. 2020 నాటి లక్ష్మీసింగ్, ఇతరులు వర్సెస్ రేఖాసింగ్ ఇతరులు కేసులో రహస్య ఓటింగ్ అనేది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్యంలో కీలకమైనదంటూ అపెక్స్ కోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని కూడా పిటీషనర్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్, రవి చీమలపాటి న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లింది. ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటామనే రైతులను.. అందుకు అనుమతించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తహసీల్దార్లు, నీటిపారుదల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఏకాభిప్రాయం కుదరని చోట విధిగా రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

కడప అర్బన్ : నగర శివారులోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జేఎంజే కళాశాల సమీపంలో మంగళవారం ఉదయం రెండు లారీలు పరస్పరం ఢీకొన్నాయి. నంద్యాల నుంచి కోడూరుకు లోడుతో వెళ్తున్న లారీ, రాజంపేట వైపు నుంచి కడప వైపు వస్తున్న లారీని రోడ్డుపై ఉన్న గుంత తప్పించబోయి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. త్రుటిలో ప్రమాదం తప్పింది. రెండువైపులా రాకపోకలు స్తంభించాయి. ఈ సంఘటనపై సమాచారం తెలుసుకున్న కడప రిమ్స్ సీఐ సీతారాం రెడ్డి, జయరాముడు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని లారీలను పక్కకు తప్పించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు చోరీ

ముద్దనూరు : మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని తీగలను ఎత్తుకెళ్లారు. గ్రామంలోని వీరమ్మ అనే మహిళ పొలంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ చోరీ జరిగింది. ప్రస్తుతం పొలంలో వరి, ఉల్లి పంటలు సాగులో ఉన్నాయి. తన పంటలు ఎండిపోకుండా అధికారులు స్పందించి తనకు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ అందించాలని ఆమె కోరుతున్నారు.

కుందూనదిలో పడి యువకుడి మృతి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడుకు చెందిన పూజారి సురేష్ బాబు(32)అనే యువకుడు గ్రామ సమీపంలో కుందూనదిలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూజారి సురేష్‌బాబు సోమవారం సాయంత్రం కాలకృత్యాల కోసం గ్రామ సమీపంలోని కుందూనది వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి గల్లంతయ్యాడు. అక్కడున్న కొందరు వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో సురేష్‌బాబు ఆచూకీ కోసం కుటుంబీకులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి అన్న లక్షుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నలు, ఇద్దరు అక్కలు ఉన్నారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆహారం కలుషితం

సాక్షిప్రతినిధి, కడప : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆహారం కలుషితం కావడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం ఓల్డ్ క్యాంపస్‌లో జరిగిన ఈ ఘటనలో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారందరికీ ట్రిపుల్ ఐటీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించినట్లు సమాచారం. కాగా నాలుగు రోజుల నుంచి విద్యార్థులు కడుపు నొప్పి, విరేచనాలతో బాధపడుతున్నారని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కూడా ఓల్డ్ క్యాంపస్‌లో ఆహారం, నీళ్ల పరీక్షించానన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రమాదం ఏమీ లేదని పేర్కొన్నారు. కాగా ఆసుపత్రి వైద్యుడు జిలాన్ మాట్లాడుతూ ప్రతిరోజు ఇలాంటి సమస్యతో విద్యార్థులు వస్తుంటారని, బయట తిన్న ఆహారం కారణంగా ఇలాంటి సమస్య వచ్చి ఉండవచ్చన్నారు. రోజూ కొన్ని వేల మంది తినే ఆహారం కలుషితమైతే ఎక్కువ మంది అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

కల్తీ నియంత్రణ..కల్ల!

ఒక మనిషి జీవించడానికి ప్రధానంగా కూడు, గూడు, గుడ్డ అవసరం. ఈ మూడింటిలో మనం తినే ఆహారానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో చెప్పకనే చెబుతోంది. అయితే ఇందుకు సంబంధించిన అతి కీలకమైన 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ' సమస్యలతో సతమతమవుతోంది.

- అన్నింటికీ కొరతే
- భారంగా మారిన పర్యవేక్షణ
- ఇదీ కీలకమైన 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ' దీన స్థితి

కడప రూరల్ : మనం తీసుకొనే ఆహారానికి సంబంధించిన అంశాలన్నీ 'జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ' పరిధిలోకి వస్తాయి. అంటే మనిషి ఆరోగ్య పరిరక్షణలో ఈ శాఖ పాత్ర ఎంతో కీలకమైంది. అలాంటి సంస్థ సమస్యలతో కొట్టు మిట్టాడుతోంది.

సంస్థ లక్ష్యం ఇదీ..

మనం తినే ప్రతి ఆహారాన్ని పర్యవేక్షించే బాధ్యతలు ఈ శాఖ పరిధిలోకే వస్తాయి. అంటే హోటళ్లు, బేకరీలు, పండ్ల వ్యాపారాలు, గోధుమ, పసుపు, నూనెలు తదితర ఆహార పదార్థాల విక్రయ, తయారీ కేంద్రాలను, కల్తీలను ఆ శాఖ పరిశీలించాలి. అందుకు సంబంధించి జిల్లాలో రెండు డివిజన్‌లు ఉన్నాయి. కడప డివిజన్–1లో కడప కార్పొరేషన్‌తో పాటు బద్వేల్, మైదుకూరు. ప్రొద్దుటూరు డివిజన్–2 పరిధిలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చినా లేదా ఏదైనా అనుమానం ఉన్నా తనిఖీలు చేపడతారు. అలాగే ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం కూడా వివిధ పదార్థాలు.. వస్తువుల నుంచి ఒక నెలకు ఆహార పదార్థాలకు సంబంధించి 12 శ్యాంపిల్స్ తీయాలి. అంటే ఒక శ్యాంపిల్‌తో పాటే అదనంగా రెండు శ్యాంపిల్స్ తీసుకుంటారు. ఆ ప్రకారం ఒక నెలకు మొత్తం 36 శ్యాంపిల్స్‌ను తీస్తారు. ఒక్కో శ్యాంపిల్ చొప్పున కల్తీ నిర్ధారణ పరీక్షల కోసం హైదరాబాద్ నాచారంలో గల ల్యాబొరేటరీకి పంపిస్తారు. అక్కడి నుంచి వచ్చిన నివేదికల ప్రకారం ఇక్కడి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కల్తీకి పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తికి భారీగా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు రెండేళ్ల జైలు శిక్ష కూడా ఉంటుంది. అలాగే ఈ శాఖకు ప్రభుత్వ రంగ సంస్థలైన హాస్టళ్లు, ఐసీడీఎస్ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఆహార సంబంధిత పథకాలను కూడా పర్యవేక్షించే అధికారం ఉంది.

సిబ్బందికి వాహనాల కొరత..

ఆహార నియంత్రణలో కొన్నేళ్ల నుంచి కీలకమైన జిల్లా ఆహార సహాయ భద్రతా అధికారి పోస్ట్ ఇన్‌చార్జిల పాలనలోనే నడుస్తోంది. అలాగే కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ముఖ్యమైన అసిస్టెంట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర ఎంతో కీలకం. కడప డివిజన్–1, ప్రొద్దుటూరు డివిజన్–2కు ఒకరి చొప్పున ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు లేకపోవడం దారుణం. ఆఖరికి ఆ శాఖ జిల్లా సహాయ అధికారికి కూడా వాహనం లేకపోవడం శోచనీయం. ఈ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నా..ఎవరైనా ఫిర్యాదు చేసినా బస్సులు లేదా తమ ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలి.



జిల్లా సహాయ ఆహార నియంత్రణ శాఖ

కీలమైన మారుమూల ప్రాంతాల్లోకి ఉన్నఫళంగా వెళ్లాలన్నా, రోజు వారీ పనులను నిర్వహించాలన్నా, ఈ సంస్థ అధికారులకు పెద్ద పరీక్షలా మారింది. అలాగే ఈ కార్యాలయం కడప పాత రిమ్స్‌లోని పాడుబడిన భవనంలో కొనసాగుతోంది.

జిల్లాలో తక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు..?

జిల్లా వ్యాప్తంగా కుప్పలు, తెప్పలుగా హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాలను, వస్తువులను తయారు చేసే కేంద్రాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఈ శాఖ పరిధిలో అధికారికంగా లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగిన సంస్థలు తక్కువ సంఖ్యలో ఉండడం గమనార్హం. కాగా జిల్లా ఔషధ నియంత్రణ శాఖ పరిధిలోనే జిల్లా వ్యాప్తంగా అధికారికంగా లైసెన్స్ కలిగిన 1,800 మెడికల్ షాపులు ఉన్నాయి. అంతకంటే కొంచెం ఎక్కువ సంఖ్యలో ఆహారానికి సంబంధించిన లైసెన్స్ కలిగిన సంస్థలు ఉండడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ.!

ఆహార పదార్థాలు కలుషితం అయితే మనిషి ఆరోగ్యం ఎలా క్షీణిస్తుందో అందరికీ తెలిసిందే. వైద్యుని వద్దకు వెళ్లినప్పుడు ఆయన నుంచి ఎదురయ్యే ప్రశ్న ఒకటే.. 'ఎక్కడ తిన్నారు..ఏం తిన్నారు'. అంటే మనం తీసుకొనే ఆహారంలో ఏమైనా నాణ్యతా లోపం ఉంటే ఆ ప్రభావం ఎంతలా ఉంటుందో దీన్ని బట్టే తెలుస్తోంది. అదేవిధంగా కలుషిత ఆహారం తీసుకొని పలువురు అస్వస్థతకు గురైన సంఘటనలు ఎన్నో చూశాం. ఆహార నియంత్రణలో పర్యవేక్షణ కొరవడిందనేందుకు ఇలాంటి సంఘటనలే నిదర్శనం.

జిల్లాలో వివరాలు	
రిజిస్ట్రేషన్‌ల సంఖ్య మొత్తం (2024 జనవరి నుంచి ఇప్పటి వరకు)	961
అందులో కేవలం కడప కార్పొరేషన్ పరిధిలోని రిజిస్ట్రేషన్‌లు	207
సేకరించిన మొత్తం శ్యాంపిల్స్	322

అన్ని చర్యలు చేపడుతున్నాం

ప్రజా ఆరోగ్య పర్యవేక్షణలో చురుకైన పాత్రను పోషిస్తున్నాం. ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. కల్తీలకు అడ్డుకట్ట వేస్తున్నాం. ఆహార నియంత్రణపై ప్రజలు, వ్యాపార సంస్థలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తున్నాం. నాణ్యతా లోపానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఏవైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయవచ్చు.

– జి.ప్రభాకర్, జిల్లా ఆహార సహాయ భద్రతా అధికారి

వైభవంగా హజరత్ ఖాదర్‌వలీ దర్గా ఉరుసు


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రామంలోని రైల్వే జామా మసీదు ప్రాంగణంలో వెలసిన హజరత్ ఖాదర్ వలీ 132వ ఉరుసు ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు.

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. దర్గా కమిటీ ప్రెసిడెంట్ కమాల్ బాషా దర్గా విశిష్టతను వివరించారు.

జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సమీఉల్లాఖాన్, సెక్రటరీ కరీముల్లా, ట్రెజరర్ సయ్యద్ అమీర్, గొబ్బిళ్ల త్రినాథ్, అరిగెల సౌమిత్రి, గడికోట వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ అనుదీప్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి అంటే అప్పులు చేయడమేనా.?

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వంలో సంపద సృష్టి అంటే అప్పులు చేయడం.. కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారం వేయడమేనా అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం ఉద్దేశ పూర్వకంగానే తాను నివాసం ఉన్న దొరసానిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను ఆహ్వానించారన్నారు. 130 ఎకరాల భూమి ఉన్న తన గ్రామాన్ని కాకుండా మిగతా గ్రామాల్లో సమావేశం నిర్వహించి ఉంటే రైతులకు ఫలితం దక్కేదన్నారు. ఈ సదస్సులో 99 శాతం మంత్రి తమ పార్టీ గొప్పలు చెప్పుకోవడానికి, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించడానికే సరిపోయిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏమి సంపద సృష్టించారో తెలపాలని కోరారు. వేల కోట్ల రూపాయలు అప్పులు చేయడమే సంపద సృష్టినా అని ప్రశ్నించారు. ప్రజల జేబులకు కన్నం వేసి రూ.15వేల కోట్లు కరెంటు బిల్లులు పెంచారన్నారు. దీనికి తోడు నిత్యావసర


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

వస్తువుల ధరలు పెరిగిపోయాయన్నారు. మద్యం షాపులను ఏర్పాటు చేసి ఊరూరా మద్యం అమ్మకాలను నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింపజేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. ప్రజలంతా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తుంటే గడిచిన ఆరు నెలల్లో లక్షా 57వేల పింఛన్లను తొలగించారన్నారు. త్వరలో గ్రామీణ రహదారులపై కూడా టోల్ గేట్లు వసూలు చేసే ప్రణాళికను తయారు చేస్తున్నారన్నారు. పరిశ్రమలు అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. పోలవరం డ్యాంను చంద్రబాబు ఏటీఎంలా వినియోగించుకుంటున్నారని స్వయంగా గతంలో ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేవలం తన సామాజిక వర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకే అమరావతి నిర్మాణం చేపడుతున్నారన్నారు. మంత్రి చెప్పిన వాటిలో ఇది మాత్రం వాస్తవం అన్నారు.

ఎకరా భూమి ఆక్రమించినట్టు నిరూపిస్తే ఇక పోటీ చేయను

తాను ఎకరం భూమి ఆక్రమించినట్లు నిరూపించినా జీవిత పర్యంతం ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. ప్రస్తుతం మీదే అధికారం, మీ ప్రభుత్వంలో చట్టాన్ని ఉపయోగించి తనపై విచారణ చేయించాలని కోరారు. ప్రభుత్వ భూమి కానీ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన భూములు కానీ ఆక్రమించినట్లు నిరూపిస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లావణ్య, జయంతి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, సత్యం, నూకా నాగేంద్రారెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చౌడం రవిచంద్ర, పోసా భాస్కర్, జంగమయ్య పాల్గొన్నారు.

ఆగని టీడీపీ వర్గీయుల ఆగడాలు

- పట్టా భూమిలో నుంచి దారి ఇవ్వలేదని మామిడి మొక్కల పెరికివేత
- ముళ్ల కంచెకు వేసిన రాతి స్తంభాలనూ తొలగించారు
- ఆపై చంపుతామని బెదిరింపులు
- ప్రాణహాని ఉందని జిల్లా ఎస్పీకి మహిళా రైతు ఫిర్యాదు


కంచెకు వేసిన రాతి స్తంభాలను కూల్చేసిన దృశ్యం

కడప టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో టీడీపీ వర్గీయుల ఆగడాలు పెచ్చుమీరి పోతున్నాయి. తమకు ఎవరైనా సహకరించకపోతే దౌర్జన్యాలకు దిగుతూ చంపుతామని బెదిరిస్తున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు భయపడి చక్రాయపేట మండలం కుప్పం గ్రామం చిన్నమోరయ్యగారిపల్లెకు చెందిన మాచిరెడ్డి పార్వతమ్మ అనే మహిళా రైతు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం గ్రామ పొలంలోని సర్వే నంబరు 786లో 3.5 ఎకరాల భూమిని 2006లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు టీడీపీ వర్గీయులు తమ పొలాలకు దగ్గరగా ఉంటుందని భావించి దౌర్జన్యంగా పార్వతమ్మ పొలంలో రోడ్డు వేసేందుకు మట్టి తోలారు. దీంతో పార్వతమ్మ కుటుంబీకులు ఆ మట్టిని తొలగించి దున్నేశారు. అనంతరం చక్రాయపేట పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రికార్డులు పరిశీలించి పార్వతమ్మ పొలంలో రస్తా ఉందా లేదా అన్న విషయం తేల్చాలని సర్వేయర్‌ను ఆదేశించారు. దీంతో సర్వేయర్ రికార్డులను పరిశీలించి ఆ భూమిలో ఎలాంటి రస్తా లేదని నివేదికను తహసీల్దారుకు ఈ ఏడాది ఫిబ్రవరి 16న సమర్పించారు. దీని ఆధారంగా తహసీల్దారు కూడా పార్వతమ్మ పొలంలో ఎలాంటి రస్తా లేదని పోలీసులకు మార్చి 18న లేఖ ద్వారా తెలిపారు. దీంతో పోలీసులు టీడీపీ వారు వేసిన దారిని మూసివేయాలని సూచించారు. అనంతరం మిన్నకుండిపోయిన టీడీపీ వర్గీయులు కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ దారి కోసం భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈనెల 7న పొలం చుట్టూ వేసిన కంచెను తొలగించి మామిడి మొక్కలను తుంచేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా అడ్డు వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని ఆమె వాపోయారు.

వారితోనే మా ప్రాణాలకు ముప్పు

తమ గ్రామానికి చెందిన గొల్లపల్లె లోకేశ్వరరెడ్డి, ఎర్రనాగు రామాంజనేయరెడ్డి, కొప్పల పాపిరెడ్డి, ఎర్రనాగు రామలక్షుమ్మ, కోటం మల్లమ్మ, ఎర్రనాగు రామలక్షుమ్మలు కలిసి బసం రామచంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి చిన్నసిద్దారెడ్డి, మూలి గంగిరెడ్డి, కొత్త కాంచాని శివారెడ్డిల ప్రోద్బలంతోనే తమ పొలాల్లో మామిడి మొక్కలను పీకేసి దౌర్జన్యం చేస్తున్నారని పార్వతమ్మ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఊర్లోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని వీరి వల్ల తనతో పాటు కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని వారిపై చర్యలు తీసుకొని తమను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ఒంటిమిట్ట : అడవుల సంరక్షణ బాధ్యత అందరిదీ అని అటవీ అధికారులు పేర్కొన్నారు. ఒంటిమిట్ట రేంజ్ చింతరాజుపల్లి బేస్ క్యాంపులో కడప ఎర్రచందనం విభాగాధిపతి రాజశేఖర్ బాబు, డీఎఫ్ఓ మదన్ మోహన్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ అటవీ నిద్ర కార్యక్రమం చేపట్టారు. మంగళవారం చింతరాజుపల్లి గ్రామంలో వన సంరక్షణ సమితితో కలిసి సమావేశం నిర్వహించారు. సభ్యులతో మాట్లాడుతూ అడవులు, వన్య ప్రాణుల ప్రాముఖ్యత, అడవులు అంతరిస్తే కలిగే నష్టాలు, అగ్ని నుంచి అడవులను కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు.ఒంటిమిట్ట రేంజ్ బాలసుబ్రమణ్యం, ఎఫ్ఆర్ఓ పాల్గొన్నారు.


అడవుల ఆవశ్యకతను వివరిస్తున్న ఎర్రచందనం విభాగాధిపతి రాజశేఖర్ బాబు

నేడు బి.మఠంలో వేలం పాటలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో బియ్యం, గంటలు, పాత ఇనుప సామాన్లకు మఠం ఆవరణంలో బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనేవారు రూ.10వేలు ధరావత్తు నగదు చెల్లించాలన్నారు.

మహిళలపై దారుణాలను అరికట్టాలి

ప్రొద్దుటూరు క్రైం : మహిళలపై జరుగుతున్న దారుణ ఘటనలను అరికట్టాలని మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. మానవ హక్కులదినం సందర్భంగా మహిళా సంఘాలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఇటీవల అమ్మాయిలపై వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలో ప్రేమించలేదనే కారణంతో ఓ యువతిపై ప్రేమోన్మాది విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడన్నారు. మహిళలు హింసకు గురవుతున్నా అందుకు గల కారణాలను సమీక్షించకుండా నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. మహిళలపై హింసకు ప్రేరేపిస్తున్న మద్యం, పోర్న్ వీడియోలు, డ్రగ్స్‌లను నిషేధించకుండా కంటి తుడుపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బాధిత మహిళలు ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఫిర్యాదును కూడా పోలీసులు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, జేవీవీ సమతా మహిళా విభాగం సభ్యురాలు సునీత, రాయలసీమ విద్యార్థి శక్తి హరిత, విరసం వరలక్ష్మి, పద్మ, రాయలసీమ మహిళా శక్తి ప్రతినిధి లక్ష్మీదేవి, ఎంపీజే సభ్యుడు సలీం, జమాతే ఇస్లామీ హింద్ సభ్యుడు షఫీవుల్లా, మహిళా విభాగం సభ్యురాలు రెహానా పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా, ప్రజాసంఘాల ప్రతినిధులు

ఆత్మహత్యకు యత్నించిన యువతిని కాపాడిన పోలీసులు

ఒంటిమిట్ట : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించిన యువతిని పోలీసులు రక్షించారు. సుండుపల్లె మండలం సాకినేని బండకు చెందిన ఓ యువతి మంగళవారం సాయంత్రం రైలు పట్టాలపై అనుమానస్పదంగా ఉండటంతో స్థానికులు ఎస్ఐ శివప్రసాద్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన సంఘటన స్థలానికి చేరుకొని యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై ఉన్నట్లు తెలుసుకుని తన సిబ్బందితో కౌన్సెలింగ్ నిర్వహించారు. యువతి ప్రేమ వ్యవహారంలో మనస్థాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తాను కడపలో ఓ ప్రైవేటు కాలేజీలో నర్సింగ్ చదువుతున్నట్లు చెప్పడంతో తమ సిబ్బందిని కాలేజీకి పంపామన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రజలను దగా చేసేందుకే సదస్సులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రజలను మభ్యపెట్టి దగా చేసేందుకే రెవెన్యూ సదస్సులు, పేరెంట్స్, టీచర్స్, స్టూడెంట్స్ మీటింగులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఎన్నో అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ హామీని అమలు చేయకుండా ఎందుకూ పనికిరాని సదస్సులు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. రెవెన్యూలో 110 ఏళ్ల తర్వాత భూములను రీ సర్వే చేయించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తిరగరాశారన్నారు. వ్యవస్థనంతా ప్రక్షాళన చేసి, రికార్డులను అప్‌డేట్ చేశారన్నారు. బ్రిటీషు కాలంలో కొలు చెల్లించలేక చాలా మంది ఇది తమ భూమేనని నమోదు చేసుకోలేదని, అలాంటి భూములను చుక్కల భూములుగా గుర్తించారన్నారు. జగన్ ప్రభుత్వం వాటన్నింటినీ రెగ్యులర్ చేసిందన్నారు. దివంగత ఎన్టీఆర్ మాజీ సైనికులకు ఇచ్చిన భూములను పదేళ్ల తర్వాత విక్రయించుకునే వెసులుబాటు కల్పించారని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక పేదలకు ఇచ్చిన డీకేటీ స్థలాలను విక్రయించే వీలు కల్పించి వారికి మేలు చేశారన్నారు. మీ సేవ కేంద్రంలో అడంగల్ ప్రింట్ తీస్తే చంద్రబాబు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫొటోలు వస్తాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా ఇలాగే వచ్చాయన్నారు. పాస్‌బుక్‌లపై జగన్ ఫొటో ముద్రిస్తున్నారని అప్పట్లో టీడీపీ దీనిపై నానా రాద్ధాంతం చేసి ప్రజలను ఆందోళనకు గురిచేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లడమే లక్ష్యంగా మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అభివృద్ధిపై పులివెందులలోనైనా, కడపలోనైనా చర్చకు వస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత సవాల్ చేయడం హాస్యాస్పదమన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు వచ్చిన సీట్లు వద్దని చెప్పినందుకా... ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను తరలించినందుకా.. అని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావడం లేదని సవిత మాట్లాడటం సరికాదని, అలా చూస్తే గత ప్రభుత్వంలో చంద్రబాబు రెండున్నరేళ్లు కూడా అసెంబ్లీకి రాలేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, అక్బర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి


లండన్ పత్రికల్లో బ్రౌన్‌పై వార్తలు

వెలుగులోకి తెచ్చిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్


సీపీ బ్రౌన్


క్లిప్పింగ్‌ను సేకరించిన విజయభాస్కర్‌రెడ్డి

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వర్ధంతిని గురువారం నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఆయన గురించి ఆసక్తికరమైన చిన్న విశేషం వెలుగులోకి వచ్చింది. ఆయన మరణం అంశాన్ని ఆనాటి లండన్ పత్రికల్లో ప్రచురించారని జిల్లాకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పేపర్ క్లిప్పింగ్‌తో సహా తెలిపారు. మన దేశం నుంచి సీపీ బ్రౌన్ తిరిగి లండన్‌కు వెళ్లాక అక్కడ తెలుగుభాష అధ్యాపకులుగా సేవలు అందించారు. అలాంటి మహనీయుడు మరణించిన సమయంలో అక్కడి పత్రికలు ఈ వార్తను ఎలా ప్రచురించాయో తెలుసుకోవాలని అందరికీ ఉంటుంది. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్న యువకుడు తవ్వా విజయభాస్కర్‌రెడ్డి అప్పటి వార్త క్లిప్పింగ్‌ను సేకరించారు. కొన్నాళ్లపాటు ఆయన చెన్నైలో ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేశారు. స్థానిక చరిత్రకారుడు, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి అన్న కుమారుడు అయిన ఆయన స్వతహాగా బ్రౌన్ గురించిన అంశాలపై ఆసక్తి చూపేవారు. బ్రౌన్ గురించి మరింత సమాచారాన్ని సేకరించేందుకు లండన్‌లోని బ్రిటీషు లైబ్రరీలో 1884 డిసెంబరు పత్రికలను పరిశీలించారు. అందులోని ఓ పత్రికలో సీపీ బ్రౌన్ మరణవార్తలు వెలుగు చూశాయి. 1798 నవంబరు 10న జన్మించిన బ్రౌన్ మన దేశానికి వచ్చి ఈస్ట్ ఇండియా కంపెనీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ కడపలో తెలుగు భాష, సాహిత్యాల వికాసానికి ఎంతో కృషి చేశారు. 1854లో తిరిగి లండన్ వెళ్లిన ఆయన అక్కడి యూనివర్సిటీ కళాశాలలో తెలుగు ఆచార్యులుగా పనిచేశారు. 1884 డిసెంబరు 12న ఆయన తన 86వ యేట లండన్‌లోని కిల్డేర్ గార్డెన్స్ ప్రాంతంలోని తన నివాస గృహంలో కన్నుమూశారు. నాలుగు రోజుల అనంతరం (డిసెంబరు 16, 1884) ఆయన మరణ వార్తను లండన్‌కు చెందిన ది టైమ్స్ వారపత్రిక ప్రచురించింది. అదే పత్రిక డిసెంబరు 27న బ్రౌన్‌కు నివాళిగా వివరణాత్మకంగా చిన్న వ్యాసాన్ని ప్రచురించింది. ఇలస్ట్రేటెడ్ పోలీసు న్యూస్ వారపత్రిక 1885 జనవరి 3న బ్రౌన్ మరణ వార్తను సంక్షిప్తంగా ప్రచురించింది. గురువారం బ్రౌన్ వర్ధంతిని నిర్వహించుకోనున్న తరుణంలో ఈ అంశం వెలుగు చూడడంతో ఈ అంశం సంతోషాన్ని కలగజేస్తోంది.


The Times
WEEKLY EDITION.

The death of Mr. Charles Philip Brown, at his residence in London, was notified in The Times at the end of last week. This gentleman, who was a son of the Rev. David Brown, Provost of the College at Calcutta, entered the Honourable East India Company's civil service as far back as 1817, and served until the year 1845 under the Government of Madras. Among the offices he is recorded as having held is that of Persian translator to the Government, and he was afterwards for many years Postmaster-General of Madras; but it was as a profound scholar of Indian languages that he became widely known in India and to many in England. In addition to a thoroughly practical knowledge of Persian, Hindustani, and Sanscrit, he devoted himself to the language and literature of the people of the Telugu country among whom his first official duties lay, and among European gentlemen he has

లండన్ పత్రికలో వెలువడిన బ్రౌన్ మరణ వార్త